

రేపు మార్కెట్ యార్డులు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): తమను ఆదాయపు పన్ను పరిధిలోకి తీసుకురావడాన్ని నిరసిస్తూ కమీషన్ ఏజెంట్లు ఈనెల 23న సమ్మెకు పిలుపు నివ్వడంతో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు యార్డులు బంద్ కానున్నాయి.



కొనసాగుతున్న నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్‌కు నీటి విడుదల కొనసాగుతోంది. మంగళవారం 817 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో 0.661 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



గురుభక్తి ఉత్సవాలు ప్రారంభం

మంత్రాలయం క్షేత్రంలో గురు భక్తి ఉత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు వేడుకలకు అంకురార్పణ పలికారు.

న్యూస్‌రీల్

పాల ఉత్పత్తిదారులకు రూ.5 కోట్ల బోనస్



ఎస్వీ జగన్‌మోహన్ రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారులకు లీటరుకు రూ.2 ప్రకారం రూ.5 కోట్ల బోనస్ విడుదల చేసినట్లు ఆ సంస్థ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. 2022 జనవరి 1 నుంచి డిసెంబరు 31 వరకు పాలు సరఫరా చేసిన వారి బ్యాంక్ ఖాతాలకు ఈ బోనస్ జమ చేసినట్లు వెల్లడించారు. ప్రైవేటు డెయిరీల పోటీ ఎక్కువగా ఉన్నప్పటికీ ఇటు పాల ఉత్పత్తిదారులు, వినియోగదారులు విజయ డెయిరీని ఆదరిస్తున్నారన్నారు. విజయ డెయిరీ లాభాల బాట పట్టడానికి ఇతోధికంగా కృషి చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు కూడా రూ.2.20 కోట్లు బోనస్ ఇస్తున్నామని, త్వరలోనే వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని ఆయన వెల్లడించారు.

బీసీల అభ్యున్నతికి వైఎస్ జగన్ కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి మధుసూదన్

ఆదోని అర్బన్ : వెనుకబడిన కులాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రాజ్యాధికారంలో బీసీలకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 139 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందన్నారు. గతంలో ఇలా ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. బీసీలను తన రాజకీయ అవసరాల కోసం చంద్రబాబు వాడుకున్నారని విమర్శించారు. వాల్మీకి సామాజికవర్గానికి చెందిన తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు సీఎం వైఎస్ జగన్‌కు, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు దేవా, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, మార్కెట్‌యార్డు చైర్మన్ బాషా, ఆయా కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, చైర్మన్లు పాల్గొన్నారు.

రూ.43.35 కోట్లతో రోడ్ల మరమ్మతులు



ఆర్ నాగరాజు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ

కర్నూలు(అర్బన్): జిల్లాలో పలు రోడ్లను కాలానుగుణంగా మరమ్మతులు చేపట్టేందుకు రూ.43.35 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు ఆర్‌అండ్‌బీ పర్యవేక్షక ఇంజినీరు ఆర్ నాగరాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఇంజినీరు ఇన్ చీఫ్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పూర్తి అధ్వానంగా తయారైన రోడ్లను ఎంపిక చేసి ప్రతిపాదనలు రూపొందించామన్నారు. ఇందులో ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రహదారులు కూడా ఉన్నాయన్నారు. రాష్ట్ర రహదారులకు సంబంధించి 16 రోడ్లలో 102.668 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేస్తామన్నారు. కర్నూలు – బళ్లారి, కోడుమూరు – ఎమ్మిగనూరు, బిల్లేకల్ – ఎమ్మిగనూరు, గుత్తి – పత్తికొండ (ఆదోని రోడ్డు), పెద్దతుంబళం – కోసిగి (హోల్వి- రాంపురం రోడ్డు), మద్దికెర – పత్తికొండ, ఆలూరు – హోళగుంద (కర్ణాటక సరిహద్దు వరకు) తదితర రోడ్లను ప్రతిపాదనల్లో చేర్చినట్లు ఎస్‌ఈ వివరించారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

ఓపెన్ స్కూల్ విద్యార్థులకు మరో అవకాశం

కర్నూలు సిటీ: ఓపెన్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ ప్రవేశం పొంది పరీక్షలు రాయని అభ్యర్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. 2021–22 విద్యా సంవత్సరం, అంతకు ముందు సంవత్సరాల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులతో పాటు ఫెయిల్ అయిన వారు కూడా పరీక్షలు రాసేందుకు అర్హత కల్పించినట్లు డీఈఓ డా.వి. రంగారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, మార్చినెల 7వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. ఫీజు కట్టిన వారికి ఏప్రిల్ 3 నుంచి పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు.

ఒక్కటై కదిలి కుటుంబమై మెదిలి!



ఇటీవల కాల్వబుగ్గ దేవాలయాన్ని శుభ్రం చేస్తున్న సేవకులు

"అక్కా ఆ పొరక ఇలా అందుకో.. అన్నా ఆ చెట్టు కొమ్మలు కత్తిరిద్దాం.. తమ్ముడూ గుడి గోపురం నీళ్లతో కడుగుదాం.. చెల్లీ నవగ్రహాలను శుభ్రం చేద్దాం.. వదినా ఆ చెత్తంతా పోగు చేద్దాం.. సార్ చుట్టూ ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిద్దాం.. అమ్మా బండలను నేను తుడుస్తా.. పిల్లలూ ఆ మెట్లు ఎక్కేటప్పుడు జాగ్రత్త. ఏంటండీ బరువు ఎక్కువగా ఉందా, ఉండండి నేనూ ఓ చేయి వేస్తా." ఏంటీ ఇదంతా ప్రతి ఇంట్లో కనిపించే సందడే కదా అనుకుంటున్నారా? కాదు.. ఒకరికొకరు సంబంధం లేకపోయినా ఆ దైవమే కుటుంబాన్ని ఏర్పరిచింది. ఆప్యాయతను పంచుకునేలా చేసింది.. దూరమవుతున్న అనుబంధాలను గుర్తు చేస్తోంది. ఇదీ జగమంత కుటుంబం.

- సాక్షి, కర్నూలు డెస్క్

మనసే దేవాలయం

- చేయిచేయి కలిపి సేవకు శ్రీకారం
- సొంత డబ్బుతో కార్యక్రమాలు
- పాల్పంచుకుంటున్న వందలాది మంది
- ఎంపిక చేసుకున్న ఆలయాల్లో 'తిరుమంజనం'
- ఓ కుటుంబంగా మారిన సభ్యులు
- సెలవు రోజుల్లో మానసిక ప్రశాంతత

నంద్యాల కేంద్రంగా రూపుదిద్దుకున్న 'మన ఊరు.. మన గుడి.. మన బాధ్యత' కార్యక్రమం దేవాలయాలకు సరికొత్త శోభను తీసుకొస్తోంది. ఒకరు, ఇద్దరు కాదు.. ఏకంగా వందల సంఖ్యలో ప్రజలు సేవకులై కదులుతున్న తీరు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోంది. వయస్సుతో సంబంధం లేకుండా, భేద భావం చూపకుండా ఒక కుటుంబంలా మెలుగుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆలయంలో ఎవరు ఏ పని చేయాలనే విషయాన్నే ముందుగానే నిర్ణయించుకొని ఆ దిశగా ప్రతి ఒక్కరు అంకితభావం చూపతుండటం భక్తులను కూడా పాల్పంచుకునేలా చేస్తోంది. రెండు నిముషాలు దేవుడి సన్నిధిలో ఉంటేనే మంచి జరుగుతుందని నమ్ముతాం, అలాంటిది గంటల తరబడి అక్కడే సేవ చేసే అవకాశం దక్కడాన్ని సేవకులు తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నారు.



12మే 2022 ఏకాదశి రోజున..

గుంటూరులో చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌గా పనిచేస్తున్న శివకుమార్‌రెడ్డి స్వస్థలం నంద్యాల. దేవాలయాలను శుభ్రం చేస్తే మంచి జరుగుతుందనే బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలను అందిపుచ్చుకుని ఆ దిశగా ప్రయత్నం ప్రారంభించారు. ఆ మేరకు మిత్రులు, పరిచయం ఉన్న వ్యక్తులకు ఫోన్లు చేసి, వాట్సాప్ గ్రూపుల్లో సమాచారం ఇచ్చి కొందరిని ఒక్కతాటిపైకి తీసుకొచ్చారు. అలా పట్టణంలోని నందీశ్వరాలయాన్ని శుభ్రం చేసేందుకు నిర్ణయించి, మొదట 150 మందికి తెలియజేయగా 50 మంది సుముఖత వ్యక్తం చేశారు. అయితే ముందు రోజు రాత్రి వర్షం కారణంగా 13 మంది మాత్రమే కార్యక్రమంలో పాల్గొన్నారు. అయినప్పటికీ ముందుగా నిర్ణయించుకున్నట్లు ఉదయం 5 గంటలకు ఆలయానికి చేరుకొని అనుకున్న కార్యాన్ని నాలుగు గంటల్లో పూర్తి చేశారు.


సహపంక్తి భోజనం

ఒక ఇంట్లో తల్లిదండ్రులు, పిల్లలు ఉంటే.. ఎవరు ఏ సమయానికి భోజనం చేస్తారో తెలియని పరిస్థితి. ఇంతకు ముందు ఇంట్లో అందరూ కలిసి కూర్చొని తింటే తప్ప సంతృప్తి కలిగేది కాదు. కాలంతో పోటీ పడే రోజులు కావడంతో ఎవరి పనుల్లో వాళ్ల బిజీ కావడంతో కలసి భోజనం చేయడమనే మాటే లేకుండా పోతోంది. అలాంటిది ఈ కార్యక్రమం సభ్యులందరినీ ఓ కుటుంబంగా మార్చేస్తుంది. కార్యక్రమం మధ్యలో అందరూ ఎంచక్కా విస్తరాకులు వేసుకొని ఒక్క చోట కూర్చొని భోజనం చేయడం ఆలయానికి వచ్చే భక్తులను సైతం ఆలోచింపజేస్తోంది.

గోమాత గోళ్ల కత్తిరిస్తూ..

'మన ఊరు.. మన గుడి.. మన బాధ్యత' దేవాలయాలకే పరిమితం కాలేదు. గోవులకు గోర్లు పెరిగి నడవటానికి ఇబ్బంది పడుతుండటాన్ని గమనించిన సభ్యులు వాటి సేవకు నడుంబిగించారు. ఇలాంటి గోవులను గుర్తించి హాఫ్ ట్రిమ్మింగ్, గిట్టలు సరిచేసే కార్యక్రమాన్ని కూడా తరచుగా చేపడుతున్నారు. ఇప్పటి వరకు 15 ఆవుల కన్నీటిని తుడిచి నడక సజావుగా సాగేందుకు దోహదపడ్డారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో తిరుమల, తిరుపతి.. శ్రీకాళహస్తి, శ్రీశైలం, మంత్రాలయంలోనూ గోవుల గోళ్లు కత్తిరించేందుకు మానవతామూర్తులు ముందుకు రావడం విశేషం.

మన ఊరు



ఎంత ఎత్తుకు ఎదిగినా.. ఎంత సంపాదించినా.. సొంత ఊళ్లో లేకపోతే ఏదో వెలితిగా ఉంటుంది. కనీసం పండగలు, పబ్బాలకైనా అక్కడ కాలు మోపకపోతే జీవితమే వృథా అనిపిస్తుంది.

మన గుడి



ఊరు అన్నాక గుడి ఉంటుంది.. బాల్యం అన్నాక ఆ గుడిలో తిరిగే ఉంటాం. కులమతాలకు అతీతంగా ఆడిపాడుతూ కలిసి తిరిగే చోటు కావడంతో ప్రతి ఒక్కరి జీవితం ఈ గుడితో ముడిపడి ఉంటుంది.

మన బాధ్యత



ఓ సినిమాలో అన్నట్లు తిరిగి వ్వకపోతే లావై పోతాం. ఇది అక్షరాలా నిజం. పుట్టిన ఊరును మర్చిపోతే మనల్ని మనం కోల్పోయినట్లే. ఇక తిరగాడిన గుడి కూడా అంతే. దేవాలయాన్ని శుభ్రం చేస్తే మనసును కడిగేసినట్లే.

కమిటీ నిర్ణయం మేరకు..





ఏ ప్రాంతానికి వెళ్లాలి, ఏ గుడిని ఎంపిక చేసుకోవాలనే విషయమై కమిటీ సభ్యులు కూర్చొని నిర్ణయం తీసుకుంటారు. ఆ తర్వాత సంబంధిత గుడి అధికారులకు సమాచారం అందించి అనుమతి పొందుతారు. అనంతరం ఈ విషయమై వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేస్తారు. గుడిని శుభ్రం చేసేందుకు అవసరమైన సామగ్రిని సొంత డబ్బుతోనే కొనుగోలు చేస్తున్నారు. నెలలో రెండు గుడులు చొప్పున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్తీక మాసానికి ముందు నవ నందుల ఆలయాన్ని ఒకేరోజు 900 మందితో కలిసి సేవ చేశారు. ఇప్పటి వరకు 32 గుళ్లను శుభ్రం చేయగా.. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ సంప్రదాయ దుస్తులను ధరించడంతో పాటు దైవనామ స్మరణతో భక్తి భావం పెంపొందిస్తుండటం విశేషం.

ఆరోగ్యం కూడా..



గుడి శుభ్రం చేయడం ద్వారా మనసుకు ఎంతో ప్రశాంతత లభిస్తుందని సేవకులు చెబుతున్నారు. అయితే ఇదే సమయంలో తెలియకుండానే ఆరోగ్యం కూడా చేకూరుతుంది. ఈ బృందంలోని ఓ సభ్యుడు ప్రతి రోజూ ఉదయాన్నే 6వేల నుంచి 7వేల అడుగుల నడక కొనసాగిస్తారు. అయితే ఈ కార్యక్రమం వల్ల దిన చర్య కాస్త మారినా, కార్యక్రమం నిర్వహణలో భాగంగా 10వేలకు పైగా అడుగులు పడటం చూస్తే ఆరోగ్యానికి ఏ స్థాయిలో సహకరించిందో అర్థమవుతుంది. ఇంటి వద్ద కనీసం నడిచేందుకు కూడా ఆరోగ్యం సహకరించని వృద్ధులు సైతం గుడిని శుభ్రం చేసేందుకు శక్తినంతటినీ కూడగట్టుకొని ఉత్సాహంగా కలియతిరగడం విశేషం.

మానసిక ప్రశాంతత



మా చిన్ననాటి స్నేహితుల కలయికకు గుర్తుగా నంద్యాలలోని ఓ పార్కును 2015లో స్వచ్ఛ భారత్ పార్కుగా తీర్చిదిద్దాం. స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో 2015లో రూపుదిద్దుకున్న ఈ పార్కు దేశ వ్యాప్తంగా గుర్తింపును సొంతం చేసుకుంది. ఇలా 2016లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్వచ్ఛ అవార్డును కైవసం చేసుకోవడం మరిచిపోలేని అనుభూతి. ఆ తర్వాత స్నేహితులంతా కలిసి ఏదో ఒక కార్యక్రమం చేస్తూనే ఉన్నాం. తాజాగా ఆలయాలను శుభ్రపరిచే బృహత్ కార్యక్రమాన్ని భుజానికెత్తుకున్నాం. ఇది మానసిక ప్రశాంతతో పాటు మానవతా విలువలను నేర్పుతోంది.

– శివకుమార్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, గుంటూరు

మల్లన్నకు పుష్పోత్సవం



భ్రామరీ సమేత మల్లికార్జున స్వామికి పుష్పోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల చివరిరోజు మంగళవారం శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివార్లకు పుష్పోత్సవం నిర్వహించారు. ఉత్సవాల చివరిరోజు సందర్భంగా స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ చేపట్టారు. ముందుగా అక్కమహాదేవి అలంకార మండపంలో శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు అశ్వవాహనసేవ నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన అశ్వవాహనంపై స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజాధికాలు చేపట్టిన అనంతరం ఆలయ ఉత్సవం నిర్వహించారు. ఉత్సవంలో డప్పువాయిద్యాలు, జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం జరిపారు. అనంతరం ఉత్సవమూర్తులకు అద్దాల మండపంలో శయనోత్సవం నిర్వహించి చివరిగా ఏకాంతసేవ నిర్వహించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 11 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రతిరోజు స్వామి అమ్మవార్లకు వివిధ రకాల వాహనసేవలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన అశ్వవాహన సేవ, పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు లక్షలాదిగా తరలి వచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

నాలుగో రోజు 'స్థానిక' నామినేషన్లు నిల్

కర్నూలు(సెంట్రల్) : జిల్లా స్థానిక సంస్థల ఎన్నికకు సంబంధించి నాలుగో రోజూ కూడా ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. ఫిబ్రవరి 23వ తేదీతో నామినేషన్ల గడువు ముగియనుండటంతో మరో రెండు రోజులు మాత్రమే మిగిలి ఉంది. బుధ లేదా గురువారాల్లో వైఎస్ఆర్‌సీపీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన డాక్టర్ ఎ.మధుసూధన్ నామినేషన్ వేసే అవకాశం ఉంది.

పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఐదుగురు నామినేషన్

అలాగే కడప-అనంతపురం-కర్నూలు పట్టభద్రుల నియోజకవర్గం శాసన మండలి ఎన్నికలకు సంబంధించి మంగళవారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన ఐదుగురు నామినేషన్లను వేశారు. ఇందులో బీజేపీ నుంచి ఎస్.రాఘవేంద్ర, స్వతంత్ర అభ్యర్థులుగా కర్నూలులోని స్టాంటన్‌పురానికి చెందిన ఎస్.వి జయకాంత్, సి. బెళగల్ మండలం పోలకల్‌కు చెందిన ఎం.రాజన్న, నంద్యాల జిల్లా పాండురంగపురానికి చెందిన వి.రామచంద్రుడు, నంద్యాల జిల్లా సంజామల మండలం నొస్సంకు చెందిన ఎస్.నరసింహులు నామినేషన్ వేశారు. అలాగే కడప-అనంతపురం-కర్నూలు ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు మంగళవారం ఆదోనికి చెందిన డి.రామశేషయ్య నామినేషన్ దాఖలు చేశారు. వీరంతా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌ఖర్గ్‌కు తమ నామినేషన్ పేపర్లు అందజేశారు.

అర్హులందరికీ జగనన్న విద్యా దీవెన

- అధికారులతో జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి నాగేశ్వరరావు

కర్నూలు(అర్బన్): జిల్లాలో అర్హులైన ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ తదితర సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ జగనన్న విద్యా దీవెన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి ఎ. నాగేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో సహాయ బీసీ సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులతో (కో-ఆర్డినేషన్ అధికారులు) ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... పలు సాంకేతిక కారణాలతో అర్హులైన విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన అందని పరిస్థితులపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలన్నారు. ఈ నెల 28వ తేదీన విద్యా దీవెన నిధులు విడుదలవుతున్న నేపథ్యంలో అనర్హత దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వం విడుదల చేసిన ఫీజు మొత్తాలను కళాశాలల్లో జమ చేసేలా చూడాలన్నారు. జిల్లాలోని ఎనిమిది ప్రాంతాల్లో బీసీ వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ వసతి గృహాల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. ఎవరైనా ఫెయిల్ అయితే అందుకు సంబంధిత వసతి గృహ సంక్షేమాధికారులపై చర్యలు తప్పవన్నారు. అలాగే డైట్ బిల్లులను కూడా నిర్దేశిత సమయంలోగా తమ కార్యాలయానికి అందించాలన్నారు. సమావేశంలో కర్నూలు, ఆదోని సహాయ బీసీ సంక్షేమాధికారులు నాగలక్ష్మమ్మ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'గురజాల' హుండీ కానుకల లెక్కింపు

నందవరం: గురజాల రామలింగేశ్వరస్వామి క్షేత్రం హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఆలయ ప్రధాన హుండీతోపాటు శివరాత్రి వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ధర్మహుండీ కానుకలను లెక్కించగా రూ. 2,66,025 సమకూరినట్లు ఆలయ ఈఓ దినేష్ తెలిపారు. హుండీ లెక్కింపులో ఆదోని డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నరసింహులు, గ్రామ సర్పంచు వీరస్వామి, కెనరా బ్యాంకు మేనేజర్ హేమంత్ కుమార్, పూజారి హంపేష్‌స్వామి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

టీకాతో రక్షణ!

- హైరిస్క్ గ్రూపులకు హెపటైటిస్ టీకా
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,655 మంది గుర్తింపు
- టీకాతో ఎయిడ్స్, హెపటైటిస్–బి, స్వలింగ సంపర్కులకు రక్షణ
- హెపటైటిస్–బి రాకుండా చర్యలు



బాధితుడికి హెపటైటిస్–బి వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది (ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): తెలిసీ తెలియక చేసిన తప్పునకు గానూ ఇప్పటికే వారు దీర్ఘకాలంగా వ్యాధినిరోధకశక్తి కోల్పోయి నిస్సారమైన జీవితాన్ని గడుపుతున్నారు. ప్రతిరోజూ పలు రకాల మందులు మింగితే గానీ వారి జీవనం కొనసాగని పరిస్థితి. వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారికి ఇంకా పలు రకాల వైరస్‌లు, బ్యాక్టీరియాలు దాడులు చేసే అవకాశముంది. ఈ నేపథ్యంలో హైరిస్క్ గ్రూప్‌లకు హెపటైటిస్–బి వైరస్ సోకకుండా రాష్ట్ర ప్రభుత్వం టీకా వేసి కాపాడుతోంది. ఈ కార్యక్రమాన్ని ఈనెల 6వ తేదీన నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, నేషనల్ హెల్త్ మిషన్, నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రామ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఏఆర్‌టీ కేంద్రంలో ప్రారంభించారు. హెచ్ఐవీ బాధితులతో పాటు లారీ డ్రైవర్లకు, సెక్స్ వర్కర్లు, స్వలింగ సంపర్కులకు ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందజేస్తున్నారు. హెచ్ఐవీ/హైరిస్క్ గ్రూపుల వారికి హెపటైటిస్–బి సోకే అవకాశం ఎక్కువ. వీరు వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా రక్షణ పొందవచ్చు. ఈ వ్యాక్సిన్ ఉమ్మడి కర్నూలు జిల్లాలో హైరిస్క్ గ్రూపులో ఉన్న 7,655 మందికి వేయనున్నారు. ఇందులో కర్నూలులో 3,582, ఆదోనిలో 992, నంద్యాలలో 3,081 మంది ఉండగా ఇప్పటి వరకు దాదాపు వెయ్యి మందికి వ్యాక్సిన్ వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

హెపటైటిస్–బి ప్రమాదకరం

హెపటైటిస్–బి ఒక కాలేయ సంబంధిత వ్యాధి. ఈ వ్యాధి సోకిన వ్యక్తి యొక్క రక్తం, వీర్యం, ఇతర శరీర ద్రవాల ద్వారా ఇతరులకు సోకుతుంది. ఇది అసురక్షితమైన లైంగిక సంపర్కం, సూదులు, సిరంజీలు పంచుకోవడం, తల్లి నుంచి బిడ్డ ఇలా వివిధ మార్గాల్లో సంక్రమిస్తుంది. హెపటైటిస్–బితో బాధపడుతున్న చాలా మందికి ఈ వ్యాధి లక్షణాలు తెలియదు. వైరస్‌సోకినట్లు కూడా వారు గుర్తించలేకపోతున్నారు. ఈ వ్యాధి లక్షణాల్లో ప్రధానంగా జ్వరం, అలసట, ఆకలిలేకపోవడం, వికారం, వాంతులు, కడుపునొప్పి, మూత్రం రంగుమారడం, కామెర్లు ఉంటాయి.

అందరికీ వ్యాక్సిన్



జిల్లాలో హైరిస్క్ గ్రూపులో ఉన్న ప్రతి ఒక్కరికీ హెపటైటిస్–బి వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాము. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నాం. ఏఆర్‌టీ కేంద్రాల్లో వ్యాక్సినేషన్ సౌలభ్యాన్ని కల్పించాం. ఇక్కడికి రాలేకపోతే వారున్న చోటకే వెళ్లి వ్యాక్సిన్ వేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ వ్యాక్సిన్ వేసుకుంటే ప్రమాదకర హెపటైటిస్–బి నుంచి ప్రాణాలు కాపాడుకోవచ్చు. –డాక్టర్ ఎల్. భాస్కర్, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ నివారణ అధికారి, కర్నూలు

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ

- తెగిపడిన బైకిస్ట్ కాలు
- పోలీసు స్టేషన్‌లో లొంగిపోయిన బస్సు డ్రైవర్


తీవ్రంగా గాయపడిన రాజు

జూపాడుబంగ్లా: కర్నూలు – ఆత్మకూరు రహదారిపై 80 బన్నూరు సమీపంలో ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తపల్లి మండలం ఎదురుపాడుకు చెందిన రాజు ముచ్చుమర్రిలోని భార్యను చూసి మంగళవారం బైక్‌పై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో 80బన్నూరు సమీపంలోని లక్ష్మీనగర్ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజు కుడి కాలు తెగి పడి తీవ్ర రక్తస్రావమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రున్ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవర్ సుబ్బరాయుడు పోలీసుస్టేషన్‌లో లొంగిపోయాడు. బస్సును స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

బండి చేతికిస్తే అంతే!

- కర్నూలు నగరానికి చెందిన మనోహర్, రాహుల్ అభిషేక్, ధనుంజయ్ స్నేహితులు. ముగ్గురూ కలసి ఈనెల 18వ తేదీన అవుట్ డోర్ స్టేడియం నుంచి కాంగ్రెస్ కార్యాలయం వైపు అతివేగంగా వెళ్తూ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట అదుపు తప్పి కింద పడ్డారు. ఈఘటనలో మనోహర్ (17) మృతిచెందగా మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.
- కర్నూలు పాతబస్తీలోని పూలబజార్‌కు చెందిన వహీద్ మియా పెద్దమార్కెట్‌లో అకౌంటెంట్. ఈనెల 7న స్టాంటన్‌పురంలో బంధువుల ఇంట్లో వేడుకకు హాజరై బైకుపై తిరిగి వస్తుండగా అశోక్‌నగర్‌లోని పాత ఎఫ్‌సీఐ ఆఫీస్ వద్ద మైనర్లు మహమ్మద్ ఫర్హాన్ (16), ఫయాజ్ (16)లు బుల్లెట్ వాహనంపై వేగంగా వెళ్తూ ఢీకొట్టారు. ఈ ఘటనలో వహీద్ మియా చనిపోవడంతో బాధిత కుటుంబం జీవనాధారం కోల్పోయింది.
- ఇలా జిల్లాలో మైనర్లు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ ఘటనల్లో కొందరు ప్రాణాలు కోల్పోతుంటే మరికొందరు ఇతరుల ప్రాణాలు తీస్తున్నారు. బాధిత కుటుంబాలకు క్షోభను మిగిలిస్తున్నారు.

- వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్న మైనర్లు
- స్పెషల్ డ్రైవ్‌లో భారీగా పట్టుబడుతున్న వైనం
- నాలుగేళ్లలో 1100 మందిపై కేసులు, రూ.5.88 లక్షల జరిమానా
- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్
- అయినా కనిపించని మార్పు



కర్నూలు క్రైం: ఈ మధ్య కాలంలో మైనర్లు రోడ్లపై వాహనాలు నడుపుతున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. ప్రమాదకరం కూడా. అయితే, చాలా మంది పిల్లల తల్లిదండ్రులు ఈ ముప్పును గ్రహించలేకపోతున్నారు. అతిగారాభం, పిల్లలకు ఏ లోటు లేకుండా చూడాలనే ఆలోచనతో చేతికి బండి ఇస్తున్నారు. తెలియనతనం, వచ్చీరాని డ్రైవింగ్‌తో విన్యాసాలు చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఎక్కువగా అదుపు తప్పి ఎదురుగా ఉన్న వ్యక్తిని ఢీకొట్టడం లేదా తనకు తానుగా పడిపోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. వీటిలో అధిక శాతం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లడం లేదు. చిన్నపిల్లలు కదా స్టేషన్‌కు వెళ్తే కేసు అవుతుందనే ఉద్దేశంతో రాజీ చేసుకుంటున్నారు. మరికొన్ని ఘటనలు పోలీసుల వరకు వెళ్లినా పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఇరు వర్గాలకు రాజీ మార్గమే చూపుతున్నారు. పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నారు.

కట్టడికి స్పెషల్ డ్రైవ్

కళాశాలలు ప్రారంభం, విడిచిపెట్టే సమయాల్లో ర్యాష్ డ్రైవింగ్ చేయడం, రహదారులు ఖాళీగా ఉన్నాయనే ఉద్దేశంతో వాయువేగంతో వెళ్తుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని పోలీసులు గుర్తించారు. నిబంధనలు పాటించకుండానే మైనర్లు రోడ్లపైకి దూసుకొస్తుండటంతో కొంతకాలంగా స్పెషల్ డ్రైవ్ కొనసాగిస్తున్నారు. కర్నూలు నగరంలోనే నాలుగేళ్లలో సుమారు 1,100 మంది మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వారి కుటుంబ పెద్దలను స్టేషన్లకు పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ సైతం ఇప్పించారు. కేసులు నమోదు చేసి ఈ–చలానా రూపంలో తల్లిదండ్రులకు రూ.5.88 లక్షల జరిమానాలు కూడా జారీ చేశారు.

మైనర్ డ్రైవింగ్ చలానా కేసులు ఇలా...

సంవత్సరం	ఈ-చలానా కేసులు	అపరాధ రుసుం
2019	272	రూ.1,45,520
2020	255	రూ.1,36,425
2021	160	రూ.85,600
2022	413	రూ.2,20,955
మొత్తం	1100	రూ.5,88,500

ప్రమాదాలకు ప్రధాన కారణాలివీ

ట్రాఫిక్ నియమాలు తెలియకపోవడం, అతివేగంతో ప్రయాణించడం, మద్యం తాగి వాహనం నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వెళ్లడం, ఇద్దరికి మించి ప్రయాణించడం, హెల్మెట్ ధరించకపోవడం, ముందు వాహనాన్ని దాటి వెళ్లాలని ప్రయత్నించడం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా పోలీసులు చెబుతున్నారు.

మైనర్ పట్టుబడితే తల్లిదండ్రులపై కేసు



రోడ్లపై మైనర్లు వాహనాలు నడుపుతూ ఎక్కడ కనిపించినా వారి తల్లిదండ్రులు లేదా వాహన యజమానిపై కేసు నమోదు చేస్తాం. కొందరు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. తల్లిదండ్రులు, పర్యవేక్షకులు ఎవరైనా 18 ఏళ్లు నిండనివారికి వాహనాలు ఇస్తే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తాం. తల్లిదండ్రుల్లో మార్పు రావాలి. పిల్లల సరదా కోసం ఆలోచిస్తే వారితో పాటు బయటి వారు ప్రమాదాల బారిన పడాల్సి వస్తుంది.

– నాగభూషణం, ట్రాఫిక్ డీఎస్పీ

త్వరలో పెళ్లి.. అంతలోనే విషాదం

- పాముకాటుతో యువతి మృతి


సరస్వతి (ఫైల్)

సి.బెళగల్: ఈనెలాఖరులో పెళ్లి జరగాల్సిన యువతి పాముకాటుకు గురై ప్రాణాలొదిలింది. మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామంలో సోమవారం రాత్రి ఈ విషాదం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామంలోని బీసీ కాలనీలో నివాసముంటున్న నారాయణ, వెంకటమ్మ దంపతులకు కుమారుడు బడేసాబ్, కూతురు సరస్వతి (18) ఉన్నారు. సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి సరస్వతి పొలం పనులకు వెళ్లగా అక్కడ పాము కరిచింది. వెంటనే కుటుంబసభ్యులు ఆ యువతిని చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. ఈ యువతికి సి.బెళగల్ గ్రామానికి చెందిన యువకుడితో వివాహం నిశ్చయమైంది. నెలాఖరులో పెళ్లి చేయాలని ఇరు కుటుంబాల పెద్దలు నిశ్చయించారు. ఈ తరుణంలో పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోవడంతో ఇరు కుటుంబాల్లో విషాదం అలుముకుంది.

రైలు కింద పడి వృద్ధుడి మృతి


మృతిచెందిన గుర్తు తెలియని వృద్ధుడు

కర్నూలు: కల్లూరు మండలం దూపాడు రైల్వేస్టేషన్ వద్ద ప్రమాదవశాత్తూ రైలు కింద పడి గుర్తు తెలియని ఓ వృద్ధుడు (65) మృతి చెందాడు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో కాచిగూడ నుంచి గుంటూరుకు వెళ్లే రైలు ఎక్కే సమయంలో ఈ ఘటన జరిగింది. రైల్వే పోలీసులు మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి



డోన్ టౌన్: పట్టణ సమీపంలోని దొరపల్లె జగనన్న కాలనీ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారి ప్రవీణ్‌కుమార్ అక్కడికి చేరుకుని జింక కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేయించారు.

తెలుగుగంగలో గుర్తు తెలియని వ్యక్తి శవం

రుద్రవరం: అప్పనపల్లె సమీపంలోని తెలుగుగంగ 19వ బ్లాక్ ఉపప్రధాన కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు దాదాపు 40 – 45 ఏళ్ల వయస్సు ఉండి, ఎరుపు, నలుపు, తెలుపు రంగుల గళ్ల చొక్కా, శరీరంపై జంధ్యం ధరించాడన్నారు. ఐదున్నర అడుగుల ఎత్తు ఉన్నాడని, ఆచూకీ తెలిస్తే సమాచారం అందజేయాలన్నారు.

పండ్ల గోదాము దగ్ధం



జూపాడుబంగ్లా: నందికొట్కూరు పాతబస్టాండు సమీపంలో ఓ పండ్ల వ్యాపారికి చెందిన గోదాము దగ్ధమైంది. శ్రీనివాసులు అనే ఫ్రూట్స్ వ్యాపారి పండ్ల నిల్వ కోసం గోదాము ఏర్పాటు చేసుకున్నాడు. మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి గోదాము పూర్తిగా దగ్ధమైంది. అరటి, దానిమ్మ, కలింగర, చీని, యాపిల్ తదితర పండ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రూ. 4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

చదువులో రాణించాలి

- కోరమాండల్ కంపెనీ సోషల్ రెస్పాన్స్‌బులిటీ అభినందనీయం
- జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్


విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న జిల్లా ఎస్పీ సిద్ధార్థకౌశల్

కర్నూలు(అగ్రికల్చర్): అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ బాలికలు చదువులో రాణించాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థకౌశల్ అన్నారు. కోరమాండల్ ఎరువుల కంపెనీ సోషల్ రెస్పాన్స్‌బులిటీ కింద జిల్లాలోని 50 జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన 100 మంది పదవ తరగతి విద్యార్థినులకు రూ. 5 లక్షలు మేర స్కాలర్‌షిప్‌లు, ప్రశంసా పత్రాలు పంపిణీ చేసింది. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీతో పాటు కోరమాండల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ జీవీ సుబ్బారెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ భాస్కరరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నాణ్యమైన ఎరువులను సరఫరా చేస్తూ రైతుల నమ్మకాన్ని చూరగొన్న కోరమాండల్ కంపెనీ సామాజిక సేవలో భాగంగా బాలిక విద్యను ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా వారికి స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, డీఈఓ రంగారెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం కోరమాండల్ కంపెనీ వైస్ చైర్మన్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్పీ కేవీ మహేష్, కోరమాండల్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.గోవిందరావు కర్నూలు జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ శివకుమార్, ఇతర ప్రతినిధులు రఘుకుమార్, శ్రీధర్‌రెడ్డి, మహబూబ్ అలీ, చెన్నకేశవులు, సీఐ తబ్రేజ్ తదితరులు పాల్గొన్నారు.

25న వాహనాల వేలం

కర్నూలు: నాటుసారా, అక్రమ మద్యం రవాణాలో పట్టుబడిన వాహనాలను ఈనెల 25వ తేదీన వేలం వేయనున్నట్లు కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచినవారు 25వ తేదీ ఉదయం 9 గంటలకు రూ.5 వేలు (తిరిగి వాపసు ఇవ్వబడును) డిపాజిట్ చెల్లించాలని కోరారు. వేలంలో వాహనం పొందినవారు మొత్తం ధరను అదే రోజు చెల్లించి స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఎస్ఐపై దాడికి యత్నం

జూపాడుబంగ్లా: రహదారి పక్కన మద్యం సేవించవద్దని మందలించిన ఎస్ఐపై ఇద్దరు మందుబాబులు దాడికి యత్నించారు. ఈ ఘటన జూపాడుబంగ్లాలో చోటు చేసుకుంది. సోమవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఎస్ఐ వెంకటసుబ్బయ్య సివిల్ డ్రెస్‌లో పోలీసు స్టేషన్ నుంచి జూపాడుబంగ్లా సంతగేటు వైపు నడుచుకుంటూ వెళ్లాడు. ఆ సమయంలో కేజీ రోడ్డు పక్కన ఉన్న టీ దుకాణం వద్ద ఆ ప్రాంతానికి చెందిన జంగాల సుంకన్న, జంగాల ఈశ్వరయ్య మద్యం సేవిస్తుండటంతో ఎస్ఐ వారించాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న వారు ఎస్ఐ కాళ్లు, చేతులు గట్టిగా పట్టుకొని దాడికి యత్నించారు. పక్కనే ఉన్న అంజి అనే వ్యక్తి అక్కడికి చేరుకుని మందుబాబులను పక్కకు తోసేశాడు. ఎస్ఐ తేరుకొని వారిని అక్కడి నుంచి తరిమేశారు. తన విధులకు ఆటంకం కలిగించటంతో పాటు దాడికి యత్నించిన సుంకన్న, ఈశ్వరయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ విషయంపై ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఎస్ఐను జిల్లా కేంద్రానికి పిలిపించి ఆరా తీశారు.

విద్యుదాఘాతంతో బాలికకు గాయాలు


చికిత్స పొందుతున్న బాలిక లలిత

ప్యాపిలి: గుడిపాడు గ్రామంలో మంగళవారం ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై ఆరేళ్ల బాలిక తీవ్రంగా గాయపడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. నరసింహ, సునీత దంపతుల కుమార్తె లలిత విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆడుకుంటుండగా చేతిలోని ప్లాస్టిక్ దండ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెపై పడింది. దీంతో దండను తీసుకునేందుకు దిమ్మెపైకి ఎక్కగా విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన స్థానికులు వెంటనే చిన్నారిని పక్కకు తప్పించారు. తీవ్రంగా గాయపడిన లలితను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతూ కోలుకుంటోంది.

ఆక్రమణల నుంచి చెరువులకు విముక్తి

- లోకాయుక్తాకు నివేదించిన గుంటూరు జిల్లా ఇరిగేషన్, పీఆర్ శాఖలు

కర్నూలు(సెంట్రల్): గుంటూరు జిల్లాలో కబ్జాకు గురవుతున్న పలు చెరువుల భూములకు ఆక్రమణల నుంచి విముక్తి కలిగించామని ఆ జిల్లాకు చెందిన పంచాయతీరాజ్, మైనర్ ఇరిగేషన్ శాఖలు లోకాయుక్తకు నివేదిక సమర్పించాయి. ఆయా చెరువులను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పునరుద్ధరించి సమీపంలోని రైతుల పొలాలకు నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, కొన్నింటిలో జలశక్తి అభియాన్ పథకం ద్వారా నీటి నిల్వలు పెంపొందించేందుకు చర్యలు చేపట్టామని చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డికి వివరించడంతో విచారణను ముగించారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దొట్టిపాడు గ్రామానికి చెందిన పచ్చల కోటేశ్వరరావు పలు చెరువుల భూములు, కాల్వలు ఆక్రమణకు గురవుతున్నాయని 2018లో లోకాయుక్తను ఆశ్రయించారు. దీంతో లోకాయుక్త విచారణ చేయాలని అప్పట్లో కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో లోకాయుక్త పలుమార్లు విచారణ జరిపి ఆక్రమణకు గురైన భూములను సంరక్షించాలని మైనర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్‌తో పాటు ఆయా చెరువులకు సంబంధించిన మునిసిపాలిటీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలో చెరువుల్లో ఆక్రమణలను తొలగిస్తూ ఆయా శాఖల అధికారులు మంగళవారం లోకాయుక్తకు నివేదిక సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పరమేష్

కోడుమూరు: ట్రాలీ ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. మంగళవారం ప్యాలకుర్తి రోడ్డులో సాయిబాబా దేవాలయం వద్ద ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. కోడుమూరుకు చెందిన బజారి కుమారుడు పరమేష్ స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే, తమ పొలంలో పండించిన వాము ధాన్యాన్ని కర్నూలు మార్కెట్‌లో విక్రయించేందుకు ట్రాలీ ఆటోలో బస్తాలను వేసుకుని మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి బయలుదేరాడు. సాయిబాబా దేవాలయం వద్ద వారి వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. వాము బస్తాలపై కూర్చున్న పరమేష్‌పై ఆటో, బస్తాలు మీద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్‌తో పాటు మరొవ్యక్తికి గాయాలయ్యాయి. పరమేష్ మృత దేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా బాధిత కుటుంబాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, కార్యవర్గ సభ్యులు పరామర్శించారు.

కారు, లారీ ఢీ

- ఇద్దరు దుర్మరణం
- ఆలమూరు గ్రామం వద్ద ఘటన



మృతి చెందిన పులుసు రమేష్‌బాబు, పుష్పలత

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామం వద్ద మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నంద్యాల వైపు వెళ్తున్న కారును సిమెంట్ లారీ ఢీ కొంది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు నంద్యాల పట్టణంలోని ఎంఎస్ నగర్‌కు చెందిన పులసు రమేష్‌బాబు (39), పుష్పలత (41) అనే మహిళతో కలిసి టీఎస్ 08ఈబీ6163 నంబర్ గల కారులో బనగానపల్లె నుంచి నంద్యాలకు వెళ్తున్నాడు. ఆలమూరు దాటిన తర్వాత మలుపు వద్ద బనగానపల్లె వైపు వెళ్తున్న సిమెంట్ లారీ ఎదురై కారును ఢీకొంది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు కావడంతో రమేష్‌బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. పుష్పలత తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన మహిళను 108 వాహనంలో శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆమె కోలుకోలేక మృతిచెందారు. కాగా మృతుల కుటుంబ వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. రమేష్‌బాబు నంద్యాల పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం.

కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్ఠం(రూ)	గరిష్ఠం (రూ)
వేరుశనగ	5,112	8,035
ఆముదం	6,150	6,460
ఉల్లి	501	830
ఎండు మిర్చి	7,699	36,699
శనగలు	2,169	4,649
కందులు	2,622	7,789
మొక్కజొన్న	1,909	2,090
మినుములు	6,896	7,180
వాము	6,282	24,555